నిలిచిన జీపీ భవన నిర్మాణాలు

● మంజూరు చేశారు.. బిల్లులు మరిచారు
● ఆందోళనలో మాజీ సర్పంచ్‌లు


నల్లగుట్ట తండాలో నిలిచిపోయిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం

నెల్లికుదురు : మండలంలోని వివిధ గ్రామాల్లో చేపడుతున్న నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. నిర్మాణాల్లో నత్తేనయం అన్న చందంగా పనులు సాగుతున్నాయి. దీనికితోడు అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చేటట్లు కనిపిస్తుంది. 36 గ్రామ పంచాయతీల్లో 22 గ్రామాలకు సొంత భవనాలు ఉండగా 7 గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో, 6 గ్రామాల్లో అద్దె భవనాల్లో పార్వతమ్మగూడెంలో అంగన్‌వాడీ సెంటర్‌లో పంచాయతీల నిర్వహణ పంచాయతీ కార్యదర్శులు కాలం వెల్లదీస్తున్నారు. అప్పటి ప్రభుత్వం సర్పంచ్‌ల పాలనలో 2022–23లో ఈజీఎస్ నుంచి 6, ఐటీడీఏ నుంచి 7 గ్రామ పంచాయతీలకు ఒక్కో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షల ప్రకారం 13 గ్రామాలకు మంజూరు చేశారు. కొన్ని గ్రామపంచాయతీలు కాంట్రాక్టర్లు నిర్మాణాలు చేపట్టగా కొన్ని జీపీ నిర్మాణాలు అప్పటి సర్పంచ్‌లు చేపట్టారు. కొన్ని గ్రామాల్లో మీత్యతండా, వస్రాం తండా లాంటి గ్రామాల్లో నిర్మాణాలు మొదలే పెట్టలేదు. నిర్మాణాలు చేపడుతున్న క్రమంలో బిల్లులు సక్రమంగా అందక కొన్ని భవనాలు పూర్తికాగా ఉపయోగంలోకి రాలేదు. మరికొన్ని భవనాలు బిల్లులు అందక నిర్మాణాలు అర్ధంతరంగా పిల్లర్లు, స్లాబ్‌తోనే నిలిచిపోయాయి. నిలిచిన గ్రామ పంచాయతీ నూతన భవనాలకు నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు పూర్తయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుకోవాలని బాధిత కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచ్‌లు కోరుతున్నారు.

పూర్తి బిల్లులు రాలే



భవన నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసింది. ఇప్పటి వరకు రూ.15 లక్షలు పెట్టి నిర్మాణ పనులు చేపడితే కేవలం రూ.6 లక్షలే అందింది. బిల్లులు అందిస్తే భవనాన్ని అప్పగిస్తాం.
– పరమేశ్వర్, మాజీ సర్పంచ్, పెద్దతండా జీపీ

రూ.17 లక్షలతో నిర్మించా



బడితండాకు నూతన గ్రామ పంచాయతీ భవనానికి రూ.17 లక్షలతో నిర్మిస్తే కేవలం రూ.6లక్షల బిల్లులు వచ్చాయి. రావాల్సిన బిల్లులు మంజూరు చేస్తే పూర్తిగా చేపట్టడం సాధ్యం అవుతుంది.
– నరేష్, మాజీ సర్పంచ్ బడితండా

ముస్నేరు ప్రాజెక్టు సాధించేంత వరకు ఉద్యమిద్దాం

● న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఐలయ్య


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న గౌని ఐలయ్య

గార్ల : మండలంలో పాకాల ఏటిపై ప్రతిపాదించిన మున్నేరు ప్రాజెక్టు సాధించేంత వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని మున్నేరు ప్రాజెక్ట్ జలసాధన కమిటీ కన్వీనర్, ఎన్‌డీ పార్టీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య స్పష్టం చేశారు. గార్లలోని సీపీఎం కార్యాలయంలో మున్నేరు ప్రాజెక్ట్ జలసాధన ఆధర్యంలో నిర్వహించిన అఖిలపక్షం నాయకుల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల మంత్రి పొంగులేటి మండల రైతులకు ఉపయోగపడకుండా మున్నేరు నీటిని పాలేరుకు తరలించేందుకు రూ.168 కోట్లు మంజూరు చేయించడాన్ని ఆయన తప్పుపట్టారు. మండల రైతులకు సాగునీరు అందించకుండా, ఇక్కడి నీటిని పాలేరు తరలిస్తే ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. గతంలో బీఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏజెన్సీ మండలాలపై సవతి తల్లి ప్రేమ చూపుతున్నారని పేర్కొన్నారు. మున్నేరు ప్రాజెక్ట్ నిర్మాణం కొరకు చేపట్టే ఉద్యమంలో అఖిలపక్షం పార్టీలు, రైతు సంఘాలు, రైతులు ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అఖిలపక్షం నాయకులు కందునూరి శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, లక్ష్మణ్‌నాయక్, సక్రు, సత్యవతి, సత్యం, రమేష్, వెంకటేశ్వర్లు, విశ్వ, లోకేశ్వర్‌రావు పాల్గొన్నారు.

గూడూరును నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సురేందర్

గూడూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న డీలిమిటేషన్, రీ ఆర్గనైజేషన్‌లో భాగంగా గూడూరు కేంద్రంగా నియోజకవర్గం ఏర్పాటు చేయాలని నియోజకవర్గ సాధన కమిటీ సమన్వయకర్త మేరెడ్డి సురేందర్ కోరారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన సాధన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే గూడూరుకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. గతంలో పరిపాలనా సౌలభ్యం కోసం గూడూరును సమితిగా, తాలూకాగా ఏర్పాటు చేసి ఇక్కడ నుంచే పరిపాలన అందించారని అన్నారు. అదే విధంగా గూడూరుకు అన్ని రకాల వసతులు, వనరులు ఉన్నాయని, గూడూరు కేంద్రంగా ఫారెస్టు సబ్ డివిజన్, పోలీస్ సర్కిల్, ఇరిగేషన్, ఐటీడీఏ, ఎడ్యుకేషన్ అండ్ విద్యాలయాలకు గూడూరు కేంద్రంగా జిల్లా అధికారులు సేవలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జలగం సంపత్‌రావు, కఠార్‌సింగ్, పెనక రాంమూర్తి, ఎంసీపీఐయూ నాయకుడు ఉపేందర్‌యాదవ్, సీపీఐ ఎంఎల్ నాయకుడు రణధీర్, బీజేపీ నాయకులు మల్లేష్‌యాదవ్, సురేష్, భాస్కర్‌నాయక్, శ్రీశైలం, బావుసింగ్ పాల్గొన్నారు.

యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా సిద్దార్థ



నెహ్రూసెంటర్ : తెలంగాణ ప్రాంతీయ పద్మశాలి యువజన సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా అనుమాల సిద్ధార్థ, కార్యదర్శిగా గడిల వినోద్, కోశాధికారిగా మెతుకు భాస్కర్ ఎన్నికయ్యారు. సంఘం జిల్లా కమిటీ సమావేశం గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ పద్మశాలి యువతరానికి చైతన్యం కల్పించేందుకు నూతన కమిటీని ఎన్నిక చేశామని తెలిపారు. కార్యక్రమంలో గద్దె రవి, వెంకటేశ్వర్లు వెంకటేశ్వర్లు, నారాయణ, ఆదినారాయణ, శ్రీను, ఉపేందర్, శేఖర్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చట్టాలపై అవగాహన

గార్ల: స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో వాయిస్ 4 గర్ల్స్ కార్యక్రమంలో భాగంగా బాలికల హక్కులు, చట్టాలపై గురువారం బాలికలకు జిల్లా శిక్షకులు ప్రియ, నిశిత అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేసుకోవద్దని, చదువుకునే వయస్సులో సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. పాఠశాలలో 10 రోజుల పాటు 8, 9, 10వ తరగతి చదువుతున్న బాలికలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ జోగయ్య, తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

గార్ల: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని గార్ల విశ్వశాంతి విద్యాలయం కరస్పాండెంట్, పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ సూచించారు. గురువారం పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కౌన్సిల్ ఎలక్షన్లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల హెచ్‌ఎం బీరవెల్లి సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ

బయ్యారం : మండలంలోని కాచనపల్లి, మొట్లగూడెం పాఠశాలలను ఎంఈఓ దేవేంద్రాచారి గురువారం తనిఖీ చేపట్టారు. కాచనపల్లి పాఠశాల పనివేళకు వెళ్లిన ఎంఈఓ విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం పాఠశాలల రికార్డులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట హెచ్‌ఎంలు డీఎస్.కిషన్, చిరంజీవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యం


మాట్లాడుతున్న ఉపేందర్‌రెడ్డి

తొర్రూరు రూరల్ : ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావాలంటే ఉద్యమాలే శరణ్యమని టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు సూరం ఉపేందర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మాటేడు, పోలెపెల్లి, చెర్లపాలెం, చీకటాయపాలెం, అరిపిరాల, తొర్రూరు ప్రభుత్వ పాఠశాలలను టీపీటీఎఫ్ వారి ఆధ్వర్యంలో సందర్శించి సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జనార్ధన్, శ్రీనివాస్, సబియా భాను, షహనాజ్ బేగం, జ్యోతి, వెంకటేశ్వర్లు, బాలునాయక్, యాకుబీ, విజయ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

చిన్నగూడూరు : నూతన తహసీల్దార్‌గా ఎస్.సంపత్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం జిల్లా సింగరేణి తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న సంపత్‌కుమార్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన సంపత్‌కుమార్‌కు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

గూడూరు : ఇందిరా మహిళా శక్తితో మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధించవచ్చని సీసీ కందిక రమేశ్ అన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో గురువారం ఐదు గ్రామైక్య సంఘాల ప్రతినిధులతో ఇందరా మహిళాశక్తి పథకంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ పథకం ద్వారా 15 రకాల వ్యాపార కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో వీఓఏలు శ్రీలత, భారతి, వీఓ ప్రతినిధులు రేష్మ, లావణ్య, సంధ్య పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక అందించాలి

కురవి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు గ్రామ పంచాయతీల్లో ఉండే ట్రాక్టర్ల ద్వారా ఇసుక అందించాలని తెలంగాణ గిరిజన సంఘం గురువారం తహసీల్దార్ విజయకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాలోత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇసుక దొరక్క ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇసుకను ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. బానోత్ దేవానాయక్, తేజావత్ రాజానాయక్, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

ఏజెన్సీ కోటా నుంచి ఇందిరమ్మ ఇళ్లు

గూడూరు : మండలంలోని ఏపూరు గ్రామానికి ఎమ్మెల్యే మురళీనాయక్ సహకారంతో ఐటీడీఏ (ఏజెన్సీ) కోటా నుంచి 14 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వాంకుడోతు చందూలాల్‌నాయక్ తెలిపారు. ఏపూరు పంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇందిరమ్మ కమిటీ సభ్యులు వెంకన్న, ఈశ్వర్‌నాయక్, మల్లయ్య, చందూనాయక్‌లతో పాటు జీపీ కార్యదర్శి రజిత మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రానికి తాళం

● వరండాలో ఆడుకుని వెళ్తున్న పిల్లలు
● ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంపై తల్లిదండ్రుల ఆగ్రహం


వరండాలో ఆడుకుంటున్న పిల్లలు

మహబూబాబాద్ : స్థానిక ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ కేందాన్ని నిర్వహిస్తున్నారు. రెండు రోజులుగా ఆ కేంద్రానికి తాళం చేసే ఉంటుంది. టీటీర్ రిటైర్మెంట్, ఆయా ఆరోగ్యం బాగా లేదనే విషయాన్ని తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకపోవడంతో పిల్లలు కేంద్రానికి వచ్చి ఆడుకుని వెళ్తున్నారు. అధికారుల తీరుపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఏరియా సూపర్‌వైజర్ కవితను వివరణ కోరగా ఆ సెంటర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించామని వారు ఎన్నికలకు సంబంధించిన మీటింగ్‌కు వెళ్లడంతో ఆమె రాలేదని సమాధానం ఇచ్చారు. టీచర్ ఆయా లేకపోవడంతో పిల్లలు, గర్భిణులకు, సరుకులు ఇతరత్రా ఇంటికి పంపిస్తున్నామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన తహసీల్దార్

బయ్యారం : మండలంలోని వినోభానగర్, జనార్ధనపురం గ్రామాల్లోని అంగన్‌వాడీకేంద్రాలను గురువారం తహసీల్దార్ నాగరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులతో మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం సరఫరా చేసిన పోషకాహారాన్ని సమయపాలన పాటించి అందించాలన్నారు.

‘జిల్లాకు చేసిందేమిటో చెప్పాలి’


మాట్లాడుతున్న శంతన్ రామరాజు

మహబూబాబాద్ రూరల్ : ఎమ్మెల్యే మురళీ నాయక్ గురించి మాట్లాడే అర్హత మాజీ మంత్రి సత్యవతి రాథోడ్కు లేదని కాంగ్రెస్ జిల్లా నాయకుడు శంతన్ రామరాజు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల పాటు తెలంగాణలో విధ్వంసపు పాలన చేసి ఎమ్మెల్యే మురళీనాయక్ పై అవాకులు, చెవాకులు పేలడం సిగ్గుచేటన్నారు. మంత్రిగా ఉన్న సమయంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ జిల్లాకు చేసిందేమిటో చెప్పాలన్నారు. ఊరుకు ఒకరిద్దరు బాగుపడితే అది బీఆర్‌ఎస్ పాలన, ఊరంతా బాగుపడితే అది కాంగ్రెస్ పాలన ఇందిరమ్మ రాజ్యమన్నారు. సమావేశంలో నాయకులు సత్యమనోరమ, కృష్ణమూర్తి, నారాయణ్ సింగ్, వీరన్న, రాములునాయక్, హరిసింగ్ నాయక్, పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోంది

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు


మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

పెద్దవంగర: కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర అరిగోస పడుతున్నారని రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకొని గురువారం స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అధ్యక్షతన సీనియర్ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి దయాకర్‌రావు హాజరై మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేసిందని చెప్పారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో సర్వేలన్నీ బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా ఉన్నాయన్నారు. పార్టీ క్యాడర్, యూత్, సోషల్ మీడియా నాయకులు ఈ ఎన్నికల్లో కష్టపడి పని చేసి పార్టీ సత్తా చాటాలని సూచించారు. కార్యక్రమంలో పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ రామచంద్రయ్య శర్మ, సీనియర్ నాయకులు పాలకుర్తి యాదగిరిరావు, శ్రీరాం సంజయ్, సుధీర్, రవి, నాయకులు, తదితతరులు పాల్గొన్నారు.

చెత్తతో యువకుడి నిరసన



డోర్నకల్ : తమ వీధికి 20 రోజులుగా చెత్త వాహనం రాకపోవడాన్ని నిరసిస్తూ ఓ యువకుడు చెత్తతో నిరసన తెలిపాడు. 10వ వార్డు పరిధిలోని కుందోజువారి వీధికి కొద్ది రోజులుగా చెత్త వాహనం రాకపోవడంతో వీధుల్లో చెత్త పేరుకుపోయిందంటూ కుందోజు లవన్ చెత్తను తీసుకుని గాంధీ సెంటర్‌కు వచ్చి విగ్రహం ఎదుట బైఠాయించాడు. మున్సిపాలిటిలో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, చెత్త వాహనాలు వీధుల్లోకి రావడంలేదని లవన్ నిరసన తెలిపాడు. కొద్ది సేపటి తర్వాత మున్సిపాలిటి సిబ్బంది, పోలీసులు గాంధీ సెంటర్‌కు చేరుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సర్ధి చెప్పడంతో లవన్ ఆందోళన విరమించాడు. అనంతరం మున్సిపాలిటీ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్, ప్రత్యేక అధికారి లెనిన్ ఉత్సవ్ టొప్పోను కలిసిన లవన్ వినతిపత్రం అందించగా సమస్య పరిష్కరిస్తామని అడిషనల్ కలెక్టర్ హామీ ఇచ్చారు.

మహాగర్జనను జయప్రదం చేయండి

గార్ల: వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 13న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన మహాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని వీహెచ్‌పీఎస్ జిల్లా కోశాధికారి కొండా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ జిల్లా మండల నాయకులు మురళితారక రామారావు, డి శ్రీనివాసరావు, పి వెంకటేశ్వర్లు, ఎస్ నారాయణ, విలాస్, వెంకట్, పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి

మహబూబాబాద్ అర్బన్ : విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ శీలం వెంకటేశ్వర్లు అన్నారు. ఎంఈఓ కార్యాలయంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం, ఉపాధ్యాయ యూనియన్లతో గురువారం సమావేశం నిర్వహించారు.

నలుగురిపై కేసు నమోదు

డోర్నకల్ : మండలంలోని బూరుగుపాడు సమీపంలోని మతంకుంటను తవ్వి గండి పెట్టిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గడ్డం ఉమ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 4న బూరుగుపాడు సమీపంలోని మతంకుంట కట్టను ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వి గండి పెట్టడంపై ఇరిగేషన్ ఏఈ జర్పుల కిషన్ ఇచ్చిన ఫిర్యాదుపై బూరుగుపాడుకు చెందిన బజ్జూరి పాపిరెడ్డి, నల్ల సురేష్, కందుల సత్యం, ఆదిమల్ల సురేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నర్సింహులపేట : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ కిన్నెర యాకయ్య అన్నారు. గురువారం వడ్డెర కాలనీ, ఎస్సీ కాలనీల్లో సందర్శించి పరిసరాల శుభ్రం కోసం బ్లీచింగ్ చల్లారు.

పెన్షన్‌దారుల సభను విజయవంతం చేయాలి

కేసముద్రం: మహబూబాబాద్‌లో ఈనెల 13న నిర్వహించనున్న పెన్షన్‌దారుల సభను విజయవంతం చేయాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెపాక శంకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభకు మందకృష్ణమాదిగ హాజరు కానునన్నట్లు ఆయన తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

తొర్రూరు: తొర్రూరు బస్ డిపో పరిధిలో నేడు (శుక్రవారం) ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం పద్మావతి తెలిపారు. ఆసక్తిగల వారు 9959226053కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

తొర్రూరు : ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ డిమాండ్ చేశారు. టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం డివిజన్ కేంద్రంలో నిర్వహించారు.

పీఆర్‌సీ అమలు చేయాలి

కేసముద్రం: ఉద్యోగ ఉపాధ్యాయులకు 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీని ప్రభుత్వం అమలు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.రమేష్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పలు పాఠశాలలను ఆ సంఘం ఆధ్వర్యంలో సందర్శిస్తూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

మహబూబాబాద్ అర్బన్ : విద్యార్థి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డీఎస్ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకుడు సూర్య ప్రకాశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య ఒకేషనల్ కళాశాలలో గురువారం డీఎస్ఎఫ్‌ఐ సభ్యత్వ నమోదు నిర్వహించారు.

కుల విభజన కాదు.. ఏకీకృత విద్య కావాలి

నెల్లికుదురు: విద్యార్థుల మధ్య కులాల అంతరాన్ని పెంచే ఇంటిగ్రేటెడ్ పాఠశాలల విధానం కాకుండా ఒకే తరగతిలో అన్ని సామాజిక వర్గాల పిల్లలకు బోధించే ఇంటిగ్రేటెడ్ స్కూల్ విధానం అమలు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సంగ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని రామన్నగూడెం పాఠశాలలో సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాల విద్యార్థులు ఒకే తరగతిలో చదువుకునే విధానం అవసరమని అన్నారు.

పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలి

నెల్లికుదురు: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా బోధించాలని ఏఎంఓ చంద్రశేఖర్ ఆజాద్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని వావిలాల ఎంపీయూపీఎస్‌ను గురువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన ప్రగతి, హాజరుపట్టిక, ఉపాధ్యాయుల తరగతి బోధన, డైరీ, ప్రారంభ పరీక్షకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

జాతీయ నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

మహబూబాబాద్ : జిల్లా కేంద్రంలోని ప్రధాన సెంటర్లలో చారిత్రక, జాతీయ, ప్రజానాయకుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి దరా ఇందుబారతి డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ రాజేశ్వర్‌కు వినతిపత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఇందు భారతి మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటుకు సంబంధించిన స్థలాల కేటాయింపు, అనుమతులు ఇవ్వాలన్నారు.

మహిళా శక్తి సంబరాలు

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని రెడ్యాలలో మహిళా శక్తి సంబురాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఐకేపీ ఏపీఎం తిలక్ హాజరై స్వయం సహాయక సంఘాల సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ 2024 ఏప్రిల్ మాసం నుంచి ఈ ఏడాది జనవరి మాసానికి సంబంధించిన 10 నెలల వడ్డీ లేని రుణాలు వచ్చాయని తెలిపారు.

డోర్నకల్ : ఇందిరా మహిళాశక్తి సంబురాలపై స్థానిక గాంధీ సెంటర్‌లో గురువారం సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. కళాబృందానికి సంబంధించి వెంకన్న కళా బృందం ఆధ్వర్యంలో కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

జిల్లాలో గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన వేడుకల్లో నగర సంకీర్తన, కాగడహారతి, 108 కలశాలతో అభిషేకం, స్వామి వారి అలంకరణ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం సామూహిక సత్యనారాయణ వ్రతాలు, మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన భక్తులచే ఆలయ పూజారులు సాయిబాబా మూలవిరాట్ విగ్రహానికి క్షీరాభిషేకాలు జరిపించారు. భక్తుల జయజయధ్వానాలతో ఆలయప్రాంగణం మార్మోగింది.
– సాక్షి నెట్‌వర్క్


కురవి : పూజలో పాల్గొన్న భక్తులు


డోర్నకల్ : సామూహిక సత్యనారాయణ వ్రతాలు


గూడూరు : వేడుకలకు హాజరైన భక్తులు


మానుకోటలో సాయినాధుడి సన్నిధిలో పూజలు చేస్తున్న శ్రీసాయి మందిర సేవా ట్రస్ట్ బాధ్యులు


తొర్రూరు : సంతోషి మందిరంలో..


గార్ల : సాయిబాబా మందిరంలో చాలీసా భజనా కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి

తొర్రూరు రూరల్/మరిపెడ రూరల్/గార్ల/గూడూరు/దంతాలపల్లి : కోతులు, చీడ పురుగుల బెడద లేకుండా, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందే ఆయిల్‌పామ్ సాగుపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు వక్తలు అన్నారు. గురువారం తొర్రూరు, మరిపెడ, గార్ల, గూడూరు, దంతాలపల్లి మండలాల్లో ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ మెగా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని సంబంధిత అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సమాజంలోని రైతాంగమంతా ఒకేలాగా ఆలోచన చేస్తూ వరి, పత్తి వంటి పంటలతో అనేక ఇబ్బందులు పడుతూ ఎక్కువశాతం సాగు చేస్తున్నారన్నారు. తద్వారా పంట చేతికి వచ్చేసరికి దిగుబడి రాక, పెట్టిన పెట్టుబడులు రాక అప్పుల పాలవుతున్నారని అన్నారు.


గార్ల : మొక్క నాటుతున్న చంద్రప్రకాష్


గూడూరు : అప్పరాజ్‌పల్లిలో..


తొర్రూరు రూరల్ : ఫత్తేపురంలో ..


దంతాలపల్లి: మొక్క నాటుతున్న తహసీల్దార్